సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 3 । నవంబర్ । 2024



ఉపాధితో రాణించాలి

స్వయం శక్తితో రాణిస్తూ పలువురికి ఉపాధి చూపాలని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. 8లో▸



మృత్యువులోనూ..

అన్నదమ్ములు వెళ్తున్న బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో ఇరువురూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. 8లో▸



జిల్లా ఖోఖో జట్టుకు..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాస్థాయి అండర్‌– 17 ఖోఖో బాలుర జట్టుకు ఇద్దరు తాండూరు విద్యార్థులు ఎంపికయ్యారు. 8లో▸

ఇంటింటికీ స్టిక్కర్!



మొత్తం 56 ప్రశ్నలు సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం

- 150 నుంచి 175 ఇళ్లకో ఎన్యూమరేటర్ నియామకం
- 5,375 మంది ఉపాధ్యాయులకు విధులు
- కులగణనపై శంషాబాద్‌లో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం
- బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు, ఇతర నేతలు డుమ్మా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇంటింటి, సమగ్ర కులగణన సర్వేకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారంగా..అధికారులు ఇప్పటికే సమగ్ర మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నారు. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్య, ఉపాధి వంటి 56 అంశాలను సేకరించనున్నారు. వివరాల సేకరణ అనంతరం సంబంధిత ఇళ్లకు స్టిక్కర్లు అంటించనున్నారు. రంగారెడ్డి జిల్లాలో 21 మండలాలు, 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు సహా 549 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో తొమ్మిది లక్షలకుపైగా కుటుంబాలు ఉన్నట్లు అంచనా. జిల్లా వ్యాప్తంగా 36,51,513 మంది ఓటర్లు ఉన్నారు. 18 ఏళ్లలోపు మరో 20 లక్షల మంది ఉన్నట్లు అంచనా. ఈ నెల 6 నుంచి 30 వరకు నిర్వహించనున్న ఈ ఇంటింటి సర్వేకు జిల్లా వ్యాప్తంగా 5,375 మంది ఎన్యూమరేటర్లు అవసరం ఉంటుందని అంచనా వేశారు. 150 నుంచి 175 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించనున్నారు. ఏ రోజు.. ఏ గ్రామంలో.. ఏ వార్డులో.. ఏ సమయంలో.. సర్వే చేపట్టనున్నారనే సమాచారాన్ని ముందే ఆయా ప్రాంతాల్లోని కుటుంబ సభ్యులకు తెలియజేస్తారు. సర్వే సమయంలో కుటుంబ సభ్యులంతా ఉండాల్సిన అవసరం లేదు. ఎవరో ఒకరు ఉండి..అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబితే సరిపోతుంది. సర్వేలో భాగంగా ఎలాంటి ఫొటోలు, గుర్తింపు పత్రాలు స్వీకరించరు. సర్వేలో భాగంగా 56 అంశాలతో అధికారులు ప్రశ్నావళిని రూపొందించారు. వీటిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఆ ఎమ్మెల్యేలు గైర్హాజరు..

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా విభాగం ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్‌లో నిర్వహించిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి.. ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి.. కాంగ్రెస్‌లో చేరిన రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ గైర్హాజరయ్యారు. అధికార పార్టీలో చేరినప్పటికీ.. ఆ పార్టీ అంతర్గత సమావేశాలకు హాజరు కాకపోవడంపై చర్చనీయాంశంగా మారింది.

కులగణనతో బలహీన వర్గాలకు బాసట: శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

శంషాబాద్: బలహీన వర్గాలకు బాసటగా నిలిచేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు రాష్ట్రంలో కులగణన సర్వే చేపట్టనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేపై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ నేతలతో పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. వర్సిటీల వీసీల నియామకంలోనూ ప్రభుత్వం బలహీన వర్గాలకే ప్రాధాన్యమిచ్చిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జరుగుతున్న కులగణన సర్వేను విజయవంతం చేయడంలో పార్టీ శ్రేణులు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పి.మహేందర్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకరయ్య, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ధనుంజయ్, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ అనితారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మూడు ఫిజికల్ కెమిస్ట్రీ, ఒక ఎకనామిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సంబంధిత పీజీ కోర్సుల్లో 55శాతం మార్కులుండాలని సూచించారు. యూజీసీ నెట్, సెట్ ఉన్న వారికి మొదటి ప్రాధాన్యతనిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 4 వరకు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 6300019101 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మెస్ చార్జీల పెంపు హర్షణీయం


కేక్ కట్‌చేస్తున్న అధ్యాపక బృందం, విద్యార్థులు

మంచాల: గురుకులాల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్‌రెడ్డి మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచడం హర్షణీయమని ప్రిన్స్‌పాల్ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం నోముల మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం కేక్ కట్‌చేసి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అధ్యాపకులు భరత్‌కుమార్, మల్లేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దురలవాట్లను దరిచేరనివ్వొద్దు

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

యాచారం: దురలవాట్లకు బానిసై.. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధి నానక్ నగర్ గ్రామంలో శనివారం స్థానికులతో ఆయన మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్, పేకాట తదితర అలవాట్లు చేసుకోవద్దని సూచించారు. వాటికి బానిసైతే.. డబ్బు పోవడం, మానసికంగా కృంగిపోవడం, ఆరోగ్యం దెబ్బతిని జీవితం ఆగం అవుతుందని హెచ్చరించారు. తల్లితండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కృష్ణంరాజు, ఎస్‌ఐ తేజంరెడ్డిలు ఉన్నారు.

సదర్ ఉత్సవానికి ప్రత్యేక గుర్తింపు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

షాద్‌నగర్: యాదవ సామాజిక వర్గం అత్యంత వైభవంగా నిర్వహించే సదర్ ఉత్సవానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న షాద్‌నగర్‌లో నిర్వహించే సదర్ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యాదవుల సంస్కృతి, సంప్రదాయానికి సదర్ ఉత్సవం ప్రతీక అన్నారు. ప్రభుత్వం యాదవుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. యాదవులంతా ఐకమత్యంగా ఉండి సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన నడికూడ యాదగిరి యాదవ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యాదయ్యయాదవ్, మల్లేశ్‌యాదవ్, అంజయ్యయాదవ్, నర్సింలు, నర్సింహ, భీమయ్య, ప్రవీణ్‌యాదవ్, బాల్‌రాజ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీశైలంయాదవ్, వెంకటేశ్, రమేశ్, కిషోర్‌యాదవ్, మాధవులు, రాజుయాదవ్, మురళీ, లింగం, అనిల్, రాజు పాల్గొన్నారు.

బడిలోనే ‘వంటావార్పు’

- పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం వండేలా ఏర్పాట్లు
- ఎస్‌ఎంసీ కృషితో దేవునిఎర్రవల్లిలో వంట సిబ్బంది నియామకం
- ‘చింపుల’ చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం


దేవునిఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

చేవెళ్ల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకుంటారని, వారికి కావాల్సిన పోషకాలతో కూడిన ఆహారం అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. చేవెళ్ల మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో శనివారం ఎస్‌ఎంసీ సహకారంతో మధ్యాహ్న భోజనం వండివార్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో వంట మనుషులు లేకపోవడంతో అక్షయ పాత్ర ద్వారా భోజనం తెప్పిస్తున్నారన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న ఈ భోజనం రుచికరంగా ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారన్నారు. నాసిరకం అన్నం తినలేక పస్తులుంటే వారు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ విషయం పాఠశాల అభివృద్ధి కమిటీకి తెలియజేయడంతో స్కూల్ ఆవరణలోనే వేడివేడి భోజనం వండి, వడ్డించేలా ఏర్పాట్లు చేశారన్నారు. ఇందుకోసం ప్రభుత్వం అందజేస్తున్న నిధులతో పాటు ఎస్‌ఎంసీ కూడా కొంత డబ్బు సమీకరించి వంట మనుషులకు అందజేసేందుకు నిర్ణయించిందని తెలిపారు. ప్రతీ స్కూల్‌లోనూ ఇలా చేస్తే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎస్‌ఎంసీ చైర్మన్ సామ రంగారెడ్డి, వైస్ చైర్మన్ కె.శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బేగరి అరుణ్‌కుమార్, సామ విఠల్‌రెడ్డి, మల్లారెడ్డి, మాణిక్యం, శ్యామలయ్య, జంగయ్యగౌడ్, రాజిరెడ్డి, ఎ.రమేశ్, బుచ్చయ్యగౌడ్, ఈశ్వర్, శ్రీనివాస్, రవీందర్, శ్రీపాల్, రాజు, ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


బీఎస్పీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో పూర్ణచంద్రరావు

ప్రజల పక్షాన నిలిచేది బీఎస్పీ ఒక్కటే

- మిగిలిన రాజకీయ పార్టీలన్నీ కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కయ్యేవే
- బీఎస్పీ ఏపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు

ఇబ్రహీంపట్నం: బహుజన్ సమాజ్ పార్టీ మినహా దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలతో కుమ్మక్కై, క్విడ్ ప్రో కో నడిపేవేనని.. వారి నుంచి బాండ్ల రూపంలో డబ్బులు తీసుకుని పనులు చేసిపెడతాయని రిటైర్డ్ డీజీపీ, బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అంబేడ్కర్ స్ఫూర్తితో కాన్షీరాం బీఎస్పీని స్థాపించారన్నారు. ఒక ఎస్సీ మహిళ ముఖ్యమంత్రి అయ్యేలా సమాజంలో మార్పు తెచ్చారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలిచి, పోరాటం చేస్తున్న పార్టీ బీఎస్పీ ఒక్కటేనని స్పష్టంచేశారు. దేశంలో 80శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉండగా చట్ట సభల్లో అరకొర సీట్లు ఇచ్చి, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. బీసీలకు రాజ్యాధికారం దక్కితేనే దేశానికి మనుగడ ఉంటుందన్నారు. పేదరికాన్ని సొమ్ము చేసుకుంటున్న పాలకులు అణగారిన వర్గాలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, పెన్షన్ల పేరుతో ఎర వేసి దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ పరిస్థితి రూపుమాసేలా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ధర్మేంద్ర, రాష్ట్ర సెక్రటరీ జి.జగన్, డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్‌తోపాటు ఎం.ప్రభాకర్, ఎ.అబ్రహం, డి.శ్రీనివాస్, పి.రాములు తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యను ఆలకించండి



గట్టుఇప్పలపల్లిలో ర్యాలీ తీస్తున్న నాయకులు

- గట్టుఇప్పలపల్లి మండల కేంద్రం ఏర్పాటుకు జేఏసీ డిమాండ్
- కొనసాగుతున్న నిరసన ర్యాలీలు, రిలే నిరాహార దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలనే డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మండలంలోనే తమ గ్రామం పెద్దదని, సుమారుగా 5 వేలకు పైగా జనాభా ఉంటుందని తెలిపారు. మండల కేంద్రంలో ఏదైనా పని ఉంటే 16 కిలోమీటర్ల దూరంలో తలకొండపల్లికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రం చేయాలనే డిమాండ్‌తో గతంలోనూ రెండు పర్యాయాలు 140 రోజుల పాటు నిరాహార దీక్షలు చేపట్టినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ గోడును ఆలకించి, సమస్యను పరిష్కరించాలని కోరారు. అంతకు ముందు గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మొక్కురాల అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, గోవింద్, మల్లయ్య, అనిల్, మల్లేశ్, బాలయ్య, జంగయ్య, రామయ్య, రాత్తయ్య, రాములు, రామకృష్ణయ్య, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో హెచ్‌ఐసీసీలో ఫెసా-2024


వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌ఎస్‌ఏఐ ప్రతినిధులు

సనత్‌నగర్: హైదరాబాద్ ఫార్మా పరిశ్రమపై ఫైర్ సంబంధిత అంశాలపై తొలిసారిగా జాతీయ స్థాయి సదస్సుకు నగరం వేదిక కానుంది. దేశంలోనే అతి పెద్ద సెమినార్ నిర్వహణను ఈ నెల 7,8 తేదీల్లో మాదాపూర్ హెచ్‌ఐసీసీలో తలపెట్టారు. ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండి యా (ఎఫ్‌ఎస్‌ఏఐ) ఆధ్వర్యంలో ఫైర్, ఎలక్ట్రిక ల్,సెక్యూరిటీఅండ్‌ఆటోమేషన్ (ఫెసా–2024) పేరిట జరిగే ఈ సదస్సులో దేశ నలుమూలల నుంచి వచ్చిన ఆయా రంగాలకు చెందిన నిపుణులు చర్చించనున్నారు. ఈ సదస్సు వివరాలను శనివారం బేగంపేట హరితా ప్లాజాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఫ్‌ఎస్‌ఏఐ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ వల్లూరి, హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు ప్రసాద్ నిష్టల, సౌత్ రీజినల్ డైరెక్టర్ ప్రసాద్‌రాజు, చైర్మన్ మనోజ్ బాలకృష్ణన్, ఆపరేషన్స్ వైస్ చైర్మన్ శ్రావణ్‌కుమార్, కార్యదర్శి చంద్రశేఖర్‌లు వెల్లడించారు.

హృదయానికి ప్రాణం పోశారు!

కోత లేకుండానే నిమ్స్‌లో గుండెకు శస్త్ర చికిత్స

- దేశంలోనే తొలిసారిగా ఈ తరహా ఆపరేషన్
- పల్మనరీ వాల్వ్‌ను విజయవంతంగా అమర్చిన వైద్యులు
- వివరాలు వెల్లడించిన డాక్టర్ సాయి సతీష్


గుండెకు అరుదైన చికిత్స చేయించుకున్న అశోక్‌తో నిమ్స్ వైద్యులు

లక్డీకాపూల్: నగరంలోని నిమ్స్ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఘనత సాధించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి ఎటువంటి కోత లేకుండానే 20 ఏళ్ల యువకుడి గుండెకు శస్త్ర చికిత్స చేసి పునర్జన్మనిచ్చారు. ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా బానోత్ అశోక్ గుండె కుడి జఠరిక నుంచి పుపుస ధమని వరకు రక్తాన్ని నడిపించే పల్మనరీ వాల్వ్‌ను విజయవంతంగా అమర్చినట్లు ప్రొఫెసర్ సాయి సతీష్ తెలిపారు. శనివారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగికి గుండె కుడి జఠరిక నుంచి పుపుస ధమని వరకు రక్తాన్ని నడిపించే పల్మనరీ వాల్వ్‌ను విజయవంతంగా అమర్చామని.. ఇది దేశంలోనే తొలిసారి అని స్పష్టం చేశారు.

అయిదేళ్ల వయసులోనే..

మహబూబాబాద్ జిల్లా నారాయణపూర్ గ్రామానికి చెందిన అశోక్ టెట్రాలజీ ఆఫ్ ఫాలోట్ అనే సైనోటిక్ గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. అశోక్ అయిదేళ్ల వయసులో ఉండగా ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. గత నాలుగేళ్లుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న అతని ఆరోగ్యం విషమ పరిస్థితికి చేరింది. గుండె కుడి వైపు ఉన్న వాల్వ్ సరిగా పని చేయని పరిస్థితి. పల్మనరీ ఆర్టరీ నుంచి గుండె కుడి కవాటానికి వెళ్లాల్సిన రక్తం వెనక్కి వస్తున్న దుస్థితి. దీంతో రోగి తీవ్రమైన శ్వాసలోపం, గుండె దడ సమస్యను ఎదుర్కొంటున్న పరిస్థితి.

ఆరోగ్యశ్రీ ద్వారా..

అశోక్ తల్లిదండ్రులు ప్రైవేట్ ఆస్పత్రులను సంప్రదించారు. అతనికి పల్మనరీ వాల్వ్ నుంచి రక్తం లీక్ అవుతున్నట్లు నిర్ధారించిన వైద్యులు చికిత్సలకు రూ.25 నుంచి రూ.35 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. దాంతో చివరిగా నిమ్స్‌ను ఆశ్రయించారు. కార్డియాలజీ విభాగం వైద్యులు సమగ్రహంగా వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి తీవ్రతను అంచనా వేశారు. అప్పటికే బైపాస్ చికిత్స జరిగినట్లు గుర్తించారు. ఆ పరిస్థితుల్లో మళ్లీ గుండెకు మళ్లీ ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం కష్టం.. సంక్లిష్టమైందని నిర్ధారించుకున్న వైద్య బృందం.. అశోక్ గుండెకు ఎలాంటి కోత లేకుండానే పెర్క్యుటేనియస్ విధానం ద్వారా వాల్వ్‌ను స్టెక్ ట్రాన్స్‌కాథెటర్ ప్లేస్‌మెంట్ చేయాలని నిర్ణయించారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేసేందుకు సమాయత్తమయ్యారు. 3 గంటల్లో వైద్యులు శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. అయితే సాధారణంగా అందుబాటులో ఉండే వాల్వ్‌లు అతనికి సరిపడలేదు. దాంతో ప్రత్యేకంగా 35 మి.మీ సైజు వాల్వ్‌ను ఊపిరితిత్తుల ప్రాంతంలో అమర్చారు. ఈ తరహా ప్రక్రియ దేశంలోనే అతిపెద్దది. గుండెకు కోత లేకుండా అరుదైన చికిత్సను ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహించామని రోగి కుటుంబానికి రూ.5 లక్షలు ఖర్చయిందని డాక్టర్ సాయి సతీష్ తెలిపారు.

అక్షరాస్యత పెంపునకు కృషి చేయండి

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్


వీసీకి హాజరైన అడిషనల్ జిల్లా అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: అక్షరాస్యత పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్ (ఎన్‌ఐఎల్‌పీ) ఇంప్లిమెంటేషన్‌పై విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 71.95 శాతం అక్షరాస్యత ఉందన్నారు. అందులో 78.94 శాతం పురుషులు, 64.63 శాతం మహిళలు ఉన్నారని తెలిపారు. ఎంఈఓలు, ఎంపీడీఓలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల చివరిలోపు లిటరసీ డాటా సేకరిస్తామని చెప్పారు. ఇప్పటికే అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో మ్యాచింగ్, బ్యాచింగ్ పూర్తి చేశామని వివరించారు. ఇక్కడ 2,341 నిరక్షరాస్యులు ఉన్నారని, వీరి కోసం 263 వలంటర్లను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ సంగీత, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, డీపీఓ సురేష్ మోహన్, అధికారులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం
- కోడిచర్ల తండాలో విషాదఛాయలు


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

కేశంపేట: పండుగ సెలవులు ఓ కుటుంబంలో విషాదాన్ని మిగిల్చాయి. అన్నదమ్ములు వెళ్తున్న బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో ఇరువురూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని లేమామిడి శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. కొత్తూరు మండల పరిధిలోని కోడిచర్ల తండాకు చెందిన బలరాం నాయక్, చంద్రకళ దంపతులకు ముగ్గురు సంతానం. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ పిల్లలను చదివిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు రవి నాయక్(21) నార్సింగి సమీపంలోని ఓ కళాశాలలో బీఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. రెండో కుమారుడితో పాటు చిన్న కుమారుడు రాకేశ్ నాయక్(19) గ్రామంలోనే కూలీ పనులు చేస్తున్నారు. ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేసి పనులు చేస్తున్నారు. ట్రాక్టర్ సాయంతో వరి గడ్డి కట్టలు కట్టేందుకు తాడు అవసరం ఉండడంతో కల్వకుర్తిలో కొనుగోలు చేసేందుకు రవి నాయక్, రాకేశ్ నాయక్ బైక్‌పై కల్వకుర్తి వెళ్తున్నారు. లేమామిడి శివారులో బ్రిడ్జి సమీపంలో తలకొండపల్లి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌కు పలుగు లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ వీరి బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో అన్నదమ్ములు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వారు మృతి చెందడంతో కోడిచర్ల తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల తండ్రి బలరాం నాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వయం ఉపాధితో రాణించాలి

మంత్రి సీతక్క


శంకర్‌పల్లి: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సీతక్క

శంకర్‌పల్లి: స్వయం శక్తితో రాణిస్తూ పలువురికి ఉపాధి చూపాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆమె దొంతాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఐడియల్ కిచెన్ హోటల్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చేవెళ్లన నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు సత్యనారాయణరెడ్డి, నాయకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి, దేవులనాయక్, తొండ రవి, జనార్దన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్–చేవెళ్ల రోడ్డును విస్తరించాలని వినతి

మొయినాబాద్: మండల పరిధిలోని వెంకటాపూర్ నుంచి చేవెళ్ల వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని.. రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి సీతక్కకు విన్నవించారు. శనివారం వారు మంత్రి సీతక్కను నగరంలోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వెంకటాపూర్ నుంచి నక్కలపల్లి, కందవాడ మీదుగా చేవెళ్ల వరకు ఉన్న రోడ్డుపై వాహనాల రాకపోకలు పెరిగాయని.. రోడ్డును విస్తరించేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. సుమారు రూ.11 కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసినవారిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎస్పీ.విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ఎం.జనార్దన్‌రెడ్డి, డి.మల్లారెడ్డి, షాబాద్ రాంరెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. శుక్రవారం పోలీసులు తెలిపిన ప్రకారం.. గాయత్రీ నగర్‌లోని ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి విగత జీవిగా పడిఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి చేతులపై హనుమంతు, అజయ్, మహే శ్ అని పచ్చబొట్లు ఉన్నాయని, తెలిసిన వారు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

యువకుడి అదృశ్యం


నాగభూషణ్(ఫైల్)

కందుకూరు: వెంచర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూరు మండలం నర్సాపూర్‌కు చెందిన కావలి నాగభూషణ్(25) భార్య జ్యోతితో కలిసి కందుకూరులో నివసిస్తున్నాడు. స్థానిక ఎస్‌వీఎస్ వెంచర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న నాగభూషణ్ అక్టోబర్ 29న కందుకూరు చౌరస్తాలో రామాజీపేట బస్ ఎక్కాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ సైదులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 8712662687 నంబర్‌లో సమాచారం అందించాలన్నారు.

అగ్నిప్రమాదంలో మరొకరి మృతి

డబీర్‌పురా: పాతబస్తీలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన టపాసులు ప్రమాదవశాత్తు పేలడంతో ఇద్దరు ఇప్పటికే మృతి చెందగా..ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మృతురాలి మనవరాలు శృతి (15) శనివారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... యాకుత్‌పురా ఈస్ట్ చంద్రానగర్ ప్రాంతానికి చెందిన మోహన్‌లాల్, ఉషాబాయి దంపతులు ఇంట్లో టపాసులను నిల్వ చేసి ఉంచారు. దీంతో గత నెల 29వ తేదీన ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో మోహన్‌లాల్, ఉషాబాయి అక్కడికక్కడే మృతి చెందారు. కాగా వీరి వద్ద ఉంటూ ఇంటర్ చదువుతున్న మనవరాలు శృతి (15) తీవ్రంగా గాయపడగా ఆసుపత్రిలో చేర్పించారు. ఈమె కూడా చికిత్స పొందుతూ శనివారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మార్ట్‌లో యువతిపై లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగులోకి..
- బయటకు చెబితే చంపుతానని బెదిరించిన నిందితుడు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఘట్‌కేసర్: పట్టణంలోని ఓ మార్టులో పనిచేసే యువతిపై సూపర్‌వైజర్ లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే..ఘట్‌కేసర్‌లోని ఓ మార్ట్‌లో బాలాజీనగర్‌కు చెందిన ఖాజా బషీర్ (35) సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అదే మార్ట్‌లో పనిచేసే ఓ యువతి(20)పై నెలరోజుల క్రితం లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించడంతో యువతి భయపడి కుటుంబ సభ్యులకు చెప్పలేదు. ఎవరికీ చెప్పుకోలేక మానసిక వ్యథకు గురయింది. శనివారం మార్ట్‌లో కళ్లు తిరిగి పడిపోవడంతో నిర్వాహకులు తల్లితండ్రులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె గర్భం దాల్చినట్లు తెలిపారు. దీంతో యువతిని తల్లితండ్రులు నిలదీయడతో లైంగిక దాడి సంఘటన వెలుగులోకి వచ్చింది. వెంటనే తల్లితండ్రులతో కలిసి శనివారం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషనలో ఫిర్యాదు చేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై సీఐ పరుశురాంను వివరణ కోరగా నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టుకు తాండూరు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న మహిపాల్‌రెడ్డి

తాండూరు: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్-17 విభాగం ఖోఖో బాలుర జట్టుకు పట్టణం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 1న నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా జట్టు కూర్పునకు ఎంపికలు నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో పట్టణంలోని గౌతమి హైస్కూల్ నుంచి పదో తరగతి విద్యార్థి అనిల్ రాథోడ్, చందు యాదవ్ ఎంపిక్యారు. నవంబర్ రెండో వారంలో నిర్వహించే రాష్ట్ర స్థాయిపోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ మేరకు శనివారం పాఠశాల కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్ సంగారెడ్డి, ప్రిన్సిపాల్ కొండారెడ్డి ఉపాధ్యాయ బృందం ఇద్దరు విద్యార్థులను అభినందించారు.

పూజారికే టోకరా..

- గుడి నిర్మాణానికి స్థలం ఇప్పిస్తానని మోసం
- అరెస్ట్ చేసిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ భూమికి నకిలీ డాక్యుమెంట్లను సృష్టించడంతో పాటు ఆ భూమిని ఓ పూజారికి విక్రయించి మోసం చేసిన ఘనాపాఠీని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు శనివారం అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌లోని సూరారంలోని శ్రీనిఖిల సాయి మైత్రేయ మధుసూదన సరస్వతీ పీఠంలో ఎస్‌వీవీ సుబ్రహ్మణ్యం పూజారిగా పని చేస్తున్నారు. మెదక్ జిల్లా శివంపేట మండలంలో గుడిని నిర్మించాలని భావించిన సుబ్రహ్మణ్యం.. తగిన స్థలం కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలో 2018లో శివంపేట తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న రత్నాపూర్ గ్రామానికి చెందిన ఉద్దండపురం నర్సింహులతో పరిచయమైంది. తాను తహసీల్దార్ ఆఫీసులో పని చేస్తున్నానని, త్వరలోనే డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి రానుందని మాయమాటలు చెప్పాడు. ఆ తర్వాత గుడి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అందిస్తామని నమ్మించాడు. పథకం ప్రకారం కొద్ది రోజుల తర్వాత అలీపూర్ గ్రామ శివార్లలో పలు ప్రభుత్వ భూములను సుబ్రహ్మణ్యానికి చూపించాడు. దీంతో సుబ్రహ్మణ్యం స్థలాన్ని కొనేందుకు ఆసక్తి చూపించడంతో.. నర్సింహులు ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ భూమికి నకిలీ డాక్యుమెంట్లను, పహాణీలను సృష్టించాడు. ఆ స్థలాన్ని తహసీల్దార్ జారీ చేశారని నమ్మించి బాధితుడి నుంచి రూ.1.20 కోట్లు వసూలు చేశాడు. ఇదే విధంగా మరో బాధితుడు ఏలేటి కుమార్ అనే వ్యక్తి నుంచి రూ.50 లక్షలు వసూలు చేశాడు. ఎన్ని రోజులు గడిచినా రిజిస్ట్రేషన్ జరగకపోవడంతో మోసపోయానని గ్రహించిన సుబ్రహ్మణ్యం సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు నర్సింహులను అరెస్ట్ చేశారు.

దూసుకొచ్చిన మృత్యువు

ఆర్టీసీ బస్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి


బస్సు చక్రాల కింద పడి మృతిచెందిన రోహిత

లాలాపేట: ఆర్టీసి బస్సు ఢీకొని ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా మంథనికి చెందిన మారుపాక రోహిత (25) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. తార్నాకలోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో తన సోదరి హర్షితతో కలిసి ఉంటున్నారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైటెక్ సిటీలో ఉద్యోగానికి వెళ్లేందుకు తార్నాక నుంచి హబ్సిగూడ వైపు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరింది. తార్నాకలోని స్మార్ట్ బజార్ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు(కూషాయిగూడ డిపోకు చెందిన 3కె, బస్ నెంబర్ ఏపీ 28జెడ్ 4637) రోహిత ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె ఎగిరి బస్సు ముందు చక్రం కింద పడింది. బస్సు టైరు రోహిత తలపై నుంచి వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా గాంధీ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఓయూ పీఎస్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మ్యారేజ్ బ్యూరో ముసుగులో వ్యభిచారం

ఖైరతాబాద్: మ్యారేజ్ బ్యూరో ముసుగులో వ్యభిచారం గృహం నిర్వహిస్తున్న వారిపై సెంట్రల్ జోన్ టాస్క్‌పోర్స్ పోలీసులు దాడిచేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్‌కు చెందిన అయేషా సిద్దిఖీ షాదాన్ కాలేజ్ లేన్‌లో మ్యారేజ్‌బ్యూరో పేరుతో కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి వ్యాపారం నిర్వహిస్తోందని తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి ప్రధాన నిర్వాహకురాలితో పాటు విటులు బానోత్ వీరుడు, షేక్ సిహాబ్, మహ్మద్ సులేమాన్, మహ్మద్ నిజాముద్దీన్‌లను అదుపులోకి తీసుకొని వీరివద్ద నుంచి ఫోన్లు, నగదు, కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని ఖైరతాబాద్ పోలీసుకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ వైర్లు

భయాందోళనకు గురైన స్థానికులు


తెగిన హైటెన్షన్ లైన్‌ను చూపుతున్న స్థానికులు

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీ వడ్డెరబస్తీలో విద్యుత్ హైటెన్షన్ వైర్లు తెగిపడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. శనివారం ఉదయం కరెంట్ సరఫరాలో లోపాలు రావడంతో బస్తీలో ఉన్న హైటెన్షన్ వైర్ తెగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదని, రెండేళ్ల క్రితం ఇదే హైటెన్షన్ వైరు తెగి మీదపడడంతో మనీలా అనే మహిళ మృతిచెందిందని స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. హైటెన్షన్ లైన్‌లో చాలా సమస్యలున్నాయని అధికారులకు విన్నవించినా ఇప్పటికీ సమస్యను పరిష్కరించలేదని వాపోయారు. పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉందని, స్కూల్ ఆవరణలో సైతం వైర్లు తెగిపడ్డాయని అన్నారు. విద్యార్థులు పరిసరప్రాంతాలకు రానివ్వకుండా అడ్డుకొని విద్యుత్ అధికారలకు సమాచారం ఇచ్చి కరెంట్ సరఫరా నిలిపివేశామన్నారు. స్థానిక కార్పొరేటర్ వనం సంగీత, సీనియర్ నేత వనం శ్రీనివాసయాదవ్, బస్తీ నేత వడ్డెర లక్ష్మణ్ ఆధ్వర్యంలో స్థానిక వడ్డెర బస్తీ నుండి శ్రీనగర్‌కాలనీ మీదుగా శ్రీనగర్‌కాలనీ సబ్‌స్టేషన్ వరకూ ర్యాలీగా వెళ్లి ధర్నాకు దిగారు. హైటెన్షన్ లైన్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ లైన్ తొలగింపుకు సిఫార్సు చేశామని, ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో ఉందని, త్వరితగతిన ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఏడీఈ ప్రేమ్‌కుమార్ తెలిపారు.